APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

01-05-2026
శుక్రవారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 186
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



## కవిత పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు
# ఈసీ గుర్తింపు

### టీఆర్ఎస్ పేరును అధికారికంగా ఇచ్చిన ఈసీ

జనవరిలో ఈసీ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేశాం

మూడో ప్రాధాన్యతగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది

- టీఆర్ఎస్ నాకు రాసిపెట్టి ఉందేమో
- తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తాన్న కవిత
- 30 రోజుల్లోపు అభ్యంతరాలను తెలపాలన్న ఎన్నికల సంఘం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** కల్వకుంట్ల కవిత పార్టీ 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)'కు ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రక్షణ సేన పేరును ఈసీ ఆమోదించింది. ఈ నెల 25న పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రకటించారు. అయితే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పేరును ఈసీ ఆమోదం తెలిపింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు లేఖ అందజేశారు. ఆరంభంలో తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజా శక్తి తదితర పేర్లలో ఒక పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కవిత కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.

**తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తా..**

తెలంగాణ రక్షణ సేన పేరుకు ఈసీ ఆమోదంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్‌కు ఈసీ ఆమోదం తెలిపిందని ఎక్స్ వేదిగా తెలిపారు. సమస్త తెలంగాణ సమాజానికి తెలియచేయడానికి సంతోషిస్తున్నానని, జనవరిలో ఈసీ నిబంధనలకు అనుగుణంగా




దరఖాస్తు చేశామని అన్నారు. మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నామని, మూడో ప్రాధాన్యతగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించిందని వెల్లడించారు. టీఆర్ఎస్ తనకు రాసిపెట్టి ఉందేమో అని తెలిపారు. రెండు దశాబ్దాలుగా చేస్తున్న కృషిని కొనసాగిస్తానని, తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు.

**అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చు..**

కొత్త పార్టీ పేరు అంశంలో..

మిగతా 2లో...

## వస్తువుల నాణ్యత విషయంలో
# రాజీపడొద్దు

### విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి

- అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు
- మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలి
- జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలి
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



2

విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద హైటెక్ భద్రత

- క్యూఆర్ కోడ్ ఉంటేనే లోపలికి ఎంట్రీ
- భవిష్యత్తులో జరిగే అన్ని లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఈ విధానాన్ని ప్రవేశపెడతాం
- అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించడానికి మూడు అంచెల భద్రతా ఏర్పాట్లు
- భారత ఎన్నికల సంఘం




2

## విహార నౌక బోల్తా పడి ఏడుగురు మృతి

- మరో 15మంది గల్లంతు
- 8 మంది సురక్షితంగా కాపాడిన పోలీసులు
- మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి



2

## సుదీర్ఘ యుద్ధానికి సిద్ధం

- సామర్థ్యం లేక ఆపరేషన్ సిందూర్‌ను ఆపేయలేదు
- అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయం
- ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ
- ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ : కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



2



## ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

- నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలి
- అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి
- జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2



## మే 10న ప్రధాని పర్యటన

మోడీ తెలంగాణ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి కీలకం

పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ

ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలి

అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే రాజకీయాలు సరికావు

కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి

2



## పేదరికమే అర్హత

- అర్హులైన వారికి ఇండ్లను ఇవ్వడమే కలెక్టర్ల బాధ్యత
- చివరి దశలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి
- ఈ ఇండ్ల నిర్మాణాలకు గ్రీన్ చానల్‌లో నిధులు విడుదల చేస్తాం
- 2 బీహెచ్‌కే బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడితే సర్వీసు నుంచి తొలగించడానికి వెనకాడబోం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2

విలేకరులు కావలెను

స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com

Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

# వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు



తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్: విద్యార్థులకు అవసరమైన సామాగ్రి అంతా సకాలంలో చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవి... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్‌లు, బెల్ట్ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువుల సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటి అందుకున్న తర్వాత వారి భావాలను తెలుసుకునేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, TGBCWRIES కార్యదర్శి బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కవిత పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు ఈసీ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)




కల్వకుంట్ల కవితకు ఈసీ లేఖ రాసింది. తెలంగాణ రక్షణ సేన పేరును ప్రాథమికంగా ఈసీ ఖరారు చేసింది. పార్టీ పేరుపై రెండు జాతీయ, రెండు స్థానిక పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని ఈసీ సూచించింది. కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే తెలపాలన్న ఎన్నికల సంఘం 30 రోజుల్లోపు అభ్యంతరాలను తెలపాలని పేర్కొంది. అభ్యంతరాల పరిశీలన తర్వాత పార్టీ పేరు ఖరారు చేస్తామని ఈసీ ప్రకటించింది. కాగా.. ఈ నెల 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ పెద్ద ఎత్తున ప్రకటించారు. పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్రం కోసం అనేక కష్టాలు పడి పిడికిలి బిగించి కొట్లాడామని తెలిపారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో హిట్లర్ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కలిసి రాష్ట్ర ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మ కోల్పోయినందుకే టీఆర్ఎస్ వచ్చిందని స్పష్టం చేశారు.

# సుదీర్ఘ యుద్ధానికి సిద్ధం

నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా.. చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో మాట్లాడుతూ కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.సామర్థ్యం లేక ఆపరేషన్ సిందూర్‌ను ఆపేయలేదని, అది ఒక వ్యూహాత్మకమైన నిర్ణయమని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. 'ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు కూడా ఒక ఉదాహరణ. ఇందులో మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకువెళ్లాయి. సొంత నిబంధనల ప్రకారమే ఆపరేషన్‌ను ప్రారంభించి.. సరైన సమయంలోనే దాన్ని ముగించాం. ఇది స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయం. అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. ఉగ్రవాదం మానవత్వానికి మాయని మచ్చ అని పేర్కొన్నారు. దీనిపై పోరాటం కేవలం భద్రతకు సంబంధించిన విషయమే కాదని.. మానవత్వపు మౌలిక విలువలను పరిరక్షించేందుకని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌పై రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ దేశాన్ని అంతర్జాతీయ ఉగ్రవాదానికి కేంద్రంగా అభివర్ణించారు. ఉగ్రవాదం కేవలం దేశ వ్యతిరేక చర్య మాత్రమే కాదని.. దానికి బహుముఖ కోణాలున్నాయన్నారు. దాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించేయాలని ఆయన పిలుపునిచ్చారు. పాక్ నిరంతరం ఉగ్రవాదానికి మద్దతిస్తోందని మండిపడ్డారు. భారత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి కేంద్రమైతే.. పాక్ ఇంటర్నేషనల్ టెర్రరిజానికి కేంద్ర బిందువుగా మారిందంటూ ఎద్దేవా చేశారు.

## ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద హైటెక్ భద్రత

నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్: కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించడానికి మూడు అంచెల భద్రతా ఏర్పాట్లను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. ఇందుకోసం క్యూ ఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. మే 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఈ కొత్త వ్యవస్థను అమలు చేయనున్నట్లు ఈసీ పేర్కొంది. అదేవిధంగా, భవిష్యత్తులో జరిగే అన్ని లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఈ విధానాన్ని ప్రవేశపెడతామని తెలిపింది.అయితే, కౌంటింగ్ కేంద్రాల్లో గుర్తింపును ధ్రువీకరిచడం కోసం మూడు అంచెల భద్రతా విషయంపై ఈసీ వివరణ ఇచ్చింది. మొదటి, రెండు భద్రతా చెక్‌పాయింట్ల వద్ద రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ) జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులను మాన్యువల్‌గా తనిఖీ చేస్తారని తెలిపింది. అలాగే, కౌంటింగ్ హాల్ సమీపంలో లోపలి భద్రతా వలయం వద్ద క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసిన తర్వాతే లోపలికి అనుమతి ఉంటుందని పేర్కొంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించడానికి ఈసీ అనుమతి పొందిన వ్యక్తులకు సైతం ఈ నూతన మార్గదర్శకాలు వర్తిస్తాయని ఈసీ స్పష్టం చేసింది. వీరిలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది, సాంకేతిక సిబ్బంది, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు తదితరులు ఉన్నారు. అలాగే, మీడియా ప్రవేశ ఏర్పాట్లు యథాతథంగా కొనసాగుతాయని ఈసీ తెలిపింది. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం ఈసీ జారీ చేసిన అధికార పత్రాల ఆధారంగా గుర్తింపు పొందిన జర్నలిస్టులకు ప్రవేశం కల్పిస్తామని కమిషన్ పేర్కొంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద మీడియా కవరేజీని సులభతరం చేయడానికి ప్రత్యేక మీడియా కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ నూతన విధానాన్ని అమలు చేయడానికి అవసరమైన అన్ని రకాల భద్రతా చర్యలను తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఈసీ ఆదేశించింది. ఇందుకోసం చెక్‌పాయింట్ల వద్ద శిక్షణ పొందిన సిబ్బందిని మోహరించాలని సూచించింది. అలాగే, లెక్కింపు ప్రక్రియలో అత్యున్నత స్థాయి పారదర్శకత, భద్రత సామర్థ్యాన్ని పాటించేందుకు ఈ సూచనలను కచ్చితంగా పాటించాలని తెలిపింది. ఈ క్రమంలో, జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయక రిటర్నింగ్ అధికారులందరికి ఆదేశాలు జారీ చేసింది.

## విహార నౌక బోల్తా పడి ఏడుగురు మృతి

నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్: మధ్యప్రదేశ్ జబల్‌పూర్ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. తుపాను కారణంగా నర్మదా నదిలో సుమారు 35 నుంచి 40 మంది ప్రయాణిస్తున్న ఒక విహార నౌక ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురు మరణించగా, సుమారు 15 మంది గల్లంతయ్యారు. నౌక నుంచి 18 మంది సురక్షితంగా కాపాడినట్లు పోలీసులు చెప్పారు. గల్లంతైన వారి కోసం SDRFతోపాటు ఇతర సహాయక బృందాలు గాలిస్తున్నాయి. ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నదిలో సుడిగుండం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మోహన్ యాదవ్ హామీ ఇచ్చారు.డ్యామ్ జలాశయంలో క్రూయిజ్ బోటు బోల్తా పడిన తర్వాత గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పోలీసులతో పాటు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్‌ఎఫ్) సంయుక్త బృందం ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టింది. గజఈతగాళ్లు, మోటార్ బోట్లు, స్పీడ్‌బోట్లు సహాయంతో ఆపరేషన్ చేపట్టారు. జిల్లా కలెక్టర్ రాఘవేంద్ర సింగ్, ఎస్పీ సంపత్ ఉపాధ్యాయ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. అయితే, 29 టికెట్లు విక్రయించినట్లు అధికారులు వివరించారు. జబల్‌పూర్ పడవ ప్రమాదంపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన, ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించారు. "తీవ్రమైన తుపాను కారణంగా బర్గి డ్యామ్ వద్ద జరిగిన ఘోర క్రూయిజ్ ప్రమాదానికి గురైంది. స్థానిక యంత్రాంగం, సహాయక దళాలు నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. ప్రజా పనుల శాఖ మంత్రి రాకేష్ సింగ్, పర్యాటక శాఖ మంత్రి ధ్రువేంద్ర సింగ్ లోధి, డివిజనల్ ఇన్‌చార్జ్ ఏసీఎస్, ఏడీజీ, స్థానిక ప్రజాప్రతినిధులను తక్షణమే ఘటనా స్థలానికి చేరుకోవాలని ఆదేశించాను. వేగవంతమైన సహాయక చర్యల ద్వారా 15 మంది పౌరులను సురక్షితంగా రక్షించారు. గల్లంతైన వారిని వీలైనంత త్వరగా గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రటిస్తున్నాం. ప్రభుత్వం తరపున సాధ్యమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తాం." అని ట్వీట్ చేశారు.

# దేశానికే ఆదర్శంగా తెలంగాణలో అక్రిడిటేషన్ల జారీ



తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్ట్‌కు అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు పాత్రికేయులకు ఆరోగ్యంతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గురువారం నాడు సమాచార శాఖ ఆధ్వర్యాన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంత్రిగారు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులను ఇంతవరకు పొడిగించామని, దేశంలో, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకు పరిశీలన సాగిందని అందువల్లే ఈ కార్డుల జారీలో ఆలస్యం చోటుచేసుకుందన్నారు. గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352 కే పరిమితం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు సుమారు 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు ఇచ్చేలా మార్పులు చేసిందని తెలిపారు. ఇప్పటికే సుమారు 2800 వరకు కార్డులను ఆమోదించడం జరిగిందని వివరించారు. జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులు చేర్పులు చేశామని, అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు ప్రసక్తే లేదని అన్నారు. మే 1వ తేదీన అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు .ఈ ప్రక్రియలో మే 10 వతేదీని ఒక కటాఫ్ డేట్‌గా పెట్టుకొని దరఖాస్తులు చేసుకోవాలని, ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్లు సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చునని అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఈ దిశగా పలు సూచనలు చేశారని వెల్లడించారు. అంతేగాక జర్నలిస్టులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందని ఈ విషయంలో ఎటువంటి సందేహాలు వద్దని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు. ఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సుపాస్‌ల గడువు ముగుస్తున్నందున మరో 15 రోజుల పాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి



తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్: రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్లో విద్యుత్ సరఫరాపై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు, అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్‌కో సీఎండీ హరీష్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వీ పాటిల్ పాల్గొన్నారు.

# పేదరికమే అర్హత..

తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్: రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నా ఈ నెల చివరి నాటికి లబ్ధిదారులను గుర్తించి కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఇన్‌చార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చివరి దశలో ఉన్న ఇండ్లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అంసపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయడానికి ఇంతవరకు ఖర్చు చేసిన మొత్తాన్ని మినహాయించి, తదుపరి అవసరమైన వ్యయాన్ని ఐదు లక్షలలోపు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందజేస్తామని వెల్లడించారు. వాటిని పూర్తిచేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే నిర్మించుకునేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ ఇండ్ల నిర్మాణాలకు గ్రీన్ చానల్‌లో నిధులు విడుదల చేస్తామన్నారు. చాలా ఇండ్లలో అనర్హులు ఉన్నారని, వారిని తొలగించి అర్హులకు ఇవ్వాలని సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తక్షణమే అనర్హులను తొలగించే చర్యలు చేపట్టాలని, అర్హులకు కేటాయించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందులో ఎమ్మెల్యేలను భాగస్వాములను చేయాలని సూచించారు. 2 బీహెచ్‌కే బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడితే సర్వీసు నుంచి తొలగించడానికి సైతం వెనకాడబోమని హెచ్చరించారు. పేదరికమే అర్హత అని, అర్హులైన వారికి ఇండ్లను ఇవ్వడమే కలెక్టర్ల బాధ్యత అని సూచించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన 40 టన్నుల ఇసుకను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. నగరానికి దూరంగా 2 బీహెచ్‌కే కాలనీలను నిర్మించడం వల్ల లబ్ధిదారులు అక్కడ నివసించడానికి ఇష్టపడటం లేదన్నారు. ఆయా కాలనీలకు సమీపంలో నివసించే వారికి కేటాయించలన్న ఆలోచన చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ లేదని మంత్రి స్పష్టం చేశారు. భూముల ఆక్రమణలను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రెవెన్యూ, ఫారెస్టు భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ఇందుకోసం రెవెన్యూ, ఫారెస్టు విభాగాలు జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. దీనిద్వారా భవిష్యత్తుల్లో వివాదాలకు తెరపడుతుందన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. భూ రికార్డుల్లో పాదర్శకత, ఖచ్చితత్వం తీసుకు రావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొత్తగా రెవెన్యూ డివిజన్లను మండలాలను ఏర్పాటు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ఇందిరమ్మ ఇండ్ల పథకం చాలా ప్రతిష్టాత్మకమైనదని.. ఈ పథకం చాలా అద్భుతంగా అమలవుతున్నదని చెప్పారు. దీనిపై కలెక్టర్లు మరింత ఫోకస్ పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు దామోదర్ రాజనరసింహ, తుమ్మల నాగేశ్వరరావు, డి.శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్‌కుమార్, హౌసింగ్ కార్యదర్శి వీపీ గౌతం తదితరులు పాల్గొన్నారు. అనంతరం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో 30 కేవీ ఉత్పాదన సామర్థ్యంతో నెలకొల్పిన సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు.

# మే 10న ప్రధాని పర్యటన

తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మే 10న తెలంగాణ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి కీలకం అని కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాదు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 10న సాయంత్రం 4 గంటలకు ప్రధాని రాష్ట్రానికి వచ్చి సుమారు రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నట్టు తెలిపారు. రైల్వే రంగంలో రాష్ట్రానికి రూ.85,000 కోట్ల పనులు జరుగుతున్నాయని, పలు ప్రాజెక్టులు పూర్తి దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్ -యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ప్రాజెక్ట్ టెండర్ పూర్తై, భూ సేకరణ అనంతరం పనులు ప్రారంభమవుతాయని వివరించారు. జహీరాబాద్‌లో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, వరంగల్‌లో కాకతీయ పీఎం మిత్ర మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ఉపాధి అవకాశాలు విస్తరించనున్నట్టు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో జాతీయ రహదారి పనులకు, హైదరాబాద్‌లో పెట్రోలియం టర్మినల్‌కు ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. తార్నాకలో నేషనల్ సైన్స్ సెంటర్, సమ్మక్కసారక్క గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణాలు కొనసాగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే రాజకీయాలు సరికావని విమర్శించారు. మే 10న పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్. కుమార్, డా. ఎస్. ప్రకాష్ రెడ్డి, పోరెడ్డి కిషోర్, పుల్లారావు యాదవ్, సమత, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

# అమీర్‌పేట్‌లో చలివేంద్రం ప్రారంభించిన దిశా లా ఫర్మ్







హైదరాబాద్ , స్నేహిత ఎక్స్‌ప్రెస్: తెలంగాణలో ప్రముఖ న్యాయ సేవల సంస్థగా గుర్తింపు పొందిన దిశా లా ఫర్మ్ అధినేత డా. నాగేశ్వరరావు పూజారి, సామాజిక బాధ్యతపై తన కట్టుబాటును మరోసారి చాటుతూ అమీర్‌పేట్‌లో చలివేంద్ర సేవా కార్యక్రమాన్ని ప్రారంభించింది. అమీర్‌పేట్‌లోని కేఎల్ఎం షాపింగ్ మాల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి న్యాయవేత్తలు, స్థానిక నాయకులు, సమాజ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేయడం ప్రతీ సంస్థ బాధ్యత అన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజూ సుమారు 1000 మందికి తాగునీరు, శీతల పానీయాలు అందించేలా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దిశా లా ఫర్మ్ న్యాయ సేవలతో పాటు సామాజిక సేవలో కూడా ముందుండి పనిచేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు సంకల్పబద్ధంగా కొనసాగుతుందన్నారు. అడ్వకేట్ నాగేశ్వర రావు పూజారితో పాటు స్థానిక నాయకులు, సంఘాల పెద్దలు మరియు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పిడుగు పడి వ్యక్తి మృతి..ఇద్దరికి తీవ్ర గాయాలు

- మేకల కాపరులపై ప్రకృతి ఆగ్రహం
- పిడుగు పడి కొండాపూర్ గ్రామానికి చెందిన కోడి ఆనందం (43) మృతి
- ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నీరటి నర్సింహులు (42) ఏర్పుల జాను (18)
- బుధవారం ఒక్కసారిగా ఈదురు గాలులు,ఉరుములతో కూడిన భారీ వర్షం బీభత్సం
- వర్షం నుండి రక్షణ కోసం చింత చెట్టుకిందకు వెళ్లిన ముగ్గురు వ్యక్తులు
- ఒక్కసారిగా చింత చెట్టు పై పడ్డ పిడుగు..ఒకరు మృతి,ఇద్దరికి తీవ్ర గాయాలు





**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారులో విషాద ఘటన చోటుచేసుకుంది. పిడుగు పడి ఓ వ్యక్తి మృతి చెందగా,మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.పెద్దేముల్ ఎస్ఐ ఎస్ఐ ఎం .ప్రశాంత్ వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం, పెద్దేముల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన కోడి ఆనందం(43), నీరటి నర్సింహులు (42), ఏర్పుల జాను(18)లు ముగ్గురు మేకల కాపరులుగా ఉంటూ ప్రతిరోజు మేకలను మేపుతూ ఉండేవారు.ఇదిలా ఉండగా ప్రతిరోజు మాదిరిగానే బుధవారం తమ మేకలను మేపడానికి కొండాపూర్ గ్రామ శివారులోకి వెళ్లారు.ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది.వర్షం నుండి రక్షణ కోసం ముగ్గురు కొండాపూర్ గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ సమీపంలోగల చింత చెట్టు కిందకు చేరుకున్నారు. సాయంత్రం సుమారు 5:15 నుంచి 5:20 గంటల మధ్య ఒక్కసారిగా ఆ చెట్టుపై పిడుగు పడింది.ఈ ఘటనలో చెట్టు కింద ఉన్న కోడి ఆనందం(43) అక్కడికక్కడే మృతి చెందగా, నీరటి నర్సింహులు(42), ఏర్పుల జాను (18)లకు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను తాండూరులోని జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యంకోసం ఇద్దరిని రెండు వేరు వేరు ప్రయివేట్ ఆసుపత్రులకు తరలించగా ప్రస్తుతం నీరటి నర్సింహులు, ఏర్పుల జాను లు అక్కడ చికిత్స పొందుతున్నారు.ఈ ఘటనతో కొండాపూర్ గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.ఇదిలా ఉంటే మృతుడు కోడి ఆనందం(43) కు భార్య,ఓ కుమారుడు, ఓ కూతురు లు ఉన్నారు.కోడి ఆనందం నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన వాడు కావడం,ఆయన కుటుంబం పిడుగు పాటుతో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడం కొండాపూర్ గ్రామస్థులను కలిచి వేసింది.ఆనందం కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కొండాపూర్ గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకొన్నాయి.

## పసికందుల ప్రాణాలు కాపాడడం మన బాధ్యత

**మండల స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్**




**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మనుషులు ఎవరు అనాధలుగ మారకూడదని పసికందుల ప్రాణాలు కాపాడం మనందరి బాధ్యతని మండల స్పెషల్ ఆఫీసర్ కరుణాకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అల్లాదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో( డోలారన )అనే విస్తృత కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆపదలో ఉన్న చిన్నారులను ఆదుకోవడానికి ఆసుపత్రి ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిశు సంక్షేమ ఉయ్యాలను వినియోగించుకోవాలని కోరారు. నిస్సహాయ స్థితిలో ఉన్న తల్లిదండ్రులు, చిన్నారులను సాకలేని పరిస్థితిలో ఉన్నవారు పసిబిడ్డలను రోడ్ల పైన, చెత్తకుప్పల్లో వదిలేసి వారి ప్రాణాలను ప్రమాదంలో పడేయకుండా ఉండడమే ఈ డోలారణ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.తొట్టిలోంచిన పిల్లల్ని ఆసుపత్రి అధికారులు, వెంటనే స్వాధీన పరుచుకొని వైద్య పరీక్షలు నిర్వహించి సంరక్షణ చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రభుత్వం సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, మూఢనమ్మకాలతో లేదా ఆర్థిక ఇబ్బందులతో పసిపిల్లలను పడేయరాదని ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శేషారెడ్డి, సర్పంచ్ సౌమ్య సురేష్ గౌడ్, ఎంపీడీవో వేద ప్రకాష్ రెడ్డి, ఎస్ఐ శంకర్,డాక్టర్ సారిక,కాంగ్రెస్ నాయకులు బాల కిషన్ తదితరులున్నారు.

## పాంబండలో 40 నెలలుగా నిరంతర గిరి ప్రదక్షిణ : మే 1న భక్తి వైభవం



**పరిగి,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పాంబండ గ్రామంలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయం లో భక్తి పరవశంతో నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణ కార్యక్రమం మరొకసారి భక్తులను ఆహ్వానిస్తోంది. మే 1 శుక్రవారం సాయంత్రం 4:30 గంటలకు ఈ పవిత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది. గత 40 నెలలుగా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతున్న ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి నెలా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ గిరి ప్రదక్షిణ చేస్తుండటం విశేషం..ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి మాట్లాడుతూ, భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. భక్తి, విశ్వాసం కలిసిన ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమం పాంబండలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పటిష్టం చేస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## భానుడి భగభగలు – జనజీవనం అతలాకుతలం



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో భానుడి తీవ్రత రోజురోజుకు పెరిగిపోతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎండలు మండిపోవడంతో చిన్నారులు, వృద్ధులు మాత్రమే కాకుండా మూగజీవాలు, పశుపక్షాదులు కూడా ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. మధ్యాహ్న సమయంలో బయటకు రావడానికే ప్రజలు భయపడుతున్న పరిస్థితి నెలకొంది.అత్యవసర పనులు ఉన్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకొని మాత్రమే బయటకు వెళ్లాల్సి వస్తోంది.తాగునీటి అవసరం పెరగడంతో దాహార్తిని తీర్చుకోవడానికి ప్రజలు నానా ప్రయత్నాలు చేస్తున్నారు.తీవ్ర ఎండల కారణంగా ప్రజలు ఎక్కువ సమయం ఇళ్లకే పరిమితమవుతున్నారు.ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల సహాయంతో ఇంట్లోనే గడుపుతూ,సాయంత్రం వేడి తగ్గిన తర్వాత మాత్రమే తమ పనుల కోసం బయటకు వస్తున్నారు.బుధవారం స్వల్ప వర్షం కురవడంతో కాసేపు ఉపశమనం లభించినప్పటికీ, తిరిగి ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలకు ఉపశమనం దొరకడం లేదు.ఎండలు ఎప్పుడు తగ్గుతాయో, వాతావరణం ఎప్పుడు చల్లబడుతుందో అని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎండల పట్ల జాగ్రత్తలపై వైద్యుల సూచనలు**

మండిపోతున్న ఎండల పట్ల వైద్యులు ప్రజలకు కొన్ని ముఖ్య సూచనలు చేస్తున్నారు.మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకపోవడం,తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం,చిన్నారులు మరియు వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ వహించడం అవసరమని సూచిస్తున్నారు.మొత్తంగా చూస్తే, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పెద్దేముల్ మండలంలో సాధారణ జీవనశైలిని దెబ్బతీస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.పరిస్థితి ఇలాగే కొనసాగితే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధన

- మండల ఏంఈఓ జకీర్ హుసేన్
- జడ్పిహెచ్ఎస్ దిగ్వాల్ లో 112 విద్యార్థులకు గాను 112 విద్యార్థులు 100 శాతం ఉత్తిర్ణత



**జహీరాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధన ఉందని మరోసారి నిరూపితమైందని, కార్పొరేట్ పాఠశలలకు దీటుగా పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితల్లో జిల్లా పరిషద్ దిగ్వాల్ విద్యార్థులు 100 శాతం ఫలితలను సాధించడం జరిగిందని మండల విద్యాదికారి మొహమ్మద్ జకీర్ హుసేన్ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..202526 విద్య సంవత్సరానికి గాను కోహిర్ మండల పరిదిలో 597 విద్యార్థులకు గాను 594 మంది విద్యార్థులు ఉత్తిర్ణత సాధించి మండలంలో 99.50 శాతం ఫలితాలు సాధించారాని,ముఖ్యంగా జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాలలో 112 మంది విద్యార్థులకు గాను 112 మంది విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తిర్ణత సాధించడంతో పాటు 577 మార్కులు సాధించి జిల్లా స్థాయి ర్యాంకును సాధించడం జరిగిందని, ఇంత చక్కటి ఫలితాలు సాధించేందుకు విద్యార్థుల కఠిన శ్రమ,ఉపాధ్యాయుల బోధన, తల్లి దండ్రుల సహకారం అని తెలుపుతూ ఉత్తిర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్నామని అన్నారు.

## వికారాబాద్ నియోజకవర్గంలో రెండో స్థానం వింటేజ్ స్కూల్

- పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటిన మోమిన్ పేట విద్యార్థిని రిష్మ టాస్కిన్
- రిష్మ టాస్కిన్,ను అభినందించిన వింటేజ్,స్కూల్ ప్రిన్సిపల్ అనిత




**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్ పేట మండల కేంద్రానికి చెందిన రిష్మ టాస్కిన్ పదవ తరగతి పరీక్షల్లో 600కు 580 మార్కులు సాధించి మండల టాపర్,గా,నిలవడంతో పాటు వికారాబాద్ నియోజకవర్గంలోనేరెండవ స్థానంలో నిలవడంతో వింటేజ్ పాఠశాల యాజమాన్యం,మరియు కుటుంబ సభ్యులు గ్రామస్తులు పలువురు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అనిత మాట్లాడుతూ మండల్ టాపర్ గానే కాకుండా నియోజకవర్గం లోనే రెండవ స్థానాన్ని సాధించడం పట్ల విద్యార్థినిని వారి తల్లిదండ్రులను ఆమె అభినందించారు గ్రామీణ ప్రాంతాల్లోనే విద్యార్థులకు ఇంతటి తెలివితేటలతో డివిజన్లోనే రెండవ స్థానంలో నిలవడం పట్ల ఆమె గర్వపడ్డారు. వింటేజ్ పాఠశాల నెలకొల్పినప్పటి నుండి ఇప్పటి వరకు ఇంత టాప్ యాంకర్ ఎవరు రాలేరని గర్వపడ్డారు. ఇలాంటి విద్యార్థినిని, తల్లిదండ్రులు మరింత ప్రోత్సహించి ఉన్నతమైన చదువులు చదివించి గ్రామానికి సమాజానికి ఆదర్శవంతంగా ఉండాలని ఆమె కోరారు.

## రవీంద్రభారత వేదికగా దళిత గౌరవానికి నిలువెత్తు నిదర్శనం






- ఎన్కేపల్లి యువకుడు పడాల బాబుకు "దళిత రత్న"అవార్డు

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని రవీంద్రభారతి లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన యువకుడు పడాల బాబుకు ప్రతిష్టాత్మక "దళిత రత్న" అవార్డు ప్రదానం చేయడం జరిగింది. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ, సేవా భావంతో ముందుకు సాగుతున్న పడాల బాబు చేసిన సేవలను గుర్తిస్తూ ఈ అవార్డు అందజేయడం విశేషం. గ్రామ స్థాయి నుంచి సామాజిక చైతన్యం పెంపొందించడంలో, పేదలకు అండగా నిలవడంలో, యువతను సన్మార్గంలో నడిపించడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయం.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, పడాల బాబు లాంటి యువకులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. దళిత సమాజానికి గౌరవాన్ని తీసుకువచ్చే విధంగా ఆయన చేస్తున్న సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. అవార్డు స్వీకరించిన అనంతరం పడాల బాబు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ గౌరవాన్ని అందించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని,భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి సేవ చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎన్కేపల్లి గ్రామ ప్రజలు,మోమిన్‌పేట్ మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ,తమ గ్రామానికి చెందిన వ్యక్తి రాష్ట్రస్థాయి గౌరవం పొందడం గర్వకారణమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు వేమారెడ్డి,బందయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్,డీజిల్,గ్యాస్ సిలిండర్లకు కొరత లేదు

**- పెద్దేముల్ మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్**




**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వంటగ్యాస్ సిలిండర్లను ఎవరైనా ఎక్కడైనా అక్రమంగా విక్రయిస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ హెచ్చరించారు.గురువారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాల మేరకు పెద్దేముల్ మండలంలోని పలు పెట్రోల్ పంపులు, గ్యాస్ ఏజెన్సీ లను స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి,యజమానులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా పెద్దేముల్ మండల తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ మాట్లాడుతూ..పెద్దేముల్ మండల పరిధిలో పెట్రోల్ ,డీజిల్,గ్యాస్ సిలిండర్లకు ఏలాంటి కొరత లేదని అన్నారు.అందులో భాగంగా పెద్దేముల్ మండల పరిధిలోని కందనెల్లి గ్రామ సమీపంలోని లక్ష్మీ గోసాయి ఫ్యూయల్ స్టేషన్‌లో సుమారు రూ.12 లక్షల విలువైన డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా సుమారు 400 లీటర్ల పెట్రోల్ కోసం చెల్లింపులు చేసినట్లు గుర్తించారు.అందులో త్వరలోనే పెట్రోల్ సరఫరా అందుబాటులోకి రానుందని తెలిపారు.అదే విధంగా పెద్దేముల్ గ్రామ శివారులోని విఘ్నేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌లో తనిఖీల సమయంలో సుమారు 4884 లీటర్ల డీజిల్, 1474 లీటర్ల పెట్రోల్ నిల్వలో ఉన్నట్లు వెల్లడించారు.మండల పరిధిలో ఎక్కడ పెట్రోల్, డీజిల్ లేదా వంటగ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు ఏలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్ స్పష్టం చేశారు. వంటగ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని,అలాంటి చర్యలు వెలుగులోకి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.తనిఖీల సమయంలో తహసీల్దార్ వెంట విఘ్నేశ్వర ఫ్యూయల్ స్టేషన్ యజమాని కోహిర్ రవిశంకర్, హెడ్ కానిస్టేబుల్ రఫీ,కానిస్టేబుల్ నవీన్,ఇతర పోలీసు సిబ్బంది భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ వైద్యాధికారిగా డా.పవిత్ర బాధ్యతలు స్వీకరణ

**వికారాబాద్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కీలక పరిపాలన మార్పులు చోటుచేసుకున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణకుమారి ని ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బదిలీ చేయగా,డిప్యూటీ సివిల్ సర్జన్‌గా సేవలందిస్తున్న డాక్టర్ పవిత్ర ని వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ డిఎంహెచ్.ఓ గా నియమించింది.ఈ నేపథ్యంలో డాక్టర్ పవిత్ర నేడు జిల్లా కలెక్టర్‌ను కలుసుకుని అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో వైద్య సేవలకు మరింత మెరుగుదలకు కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.డాక్టర్ స్వర్ణకుమారి తన పదవీకాలంలో వికారాబాద్ జిల్లాలో ప్రజారోగ్య సేవల బలోపేతానికి విశేష కృషి చేశారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ,గ్రామీణ ప్రాంతాలకు వైద్యసేవలను చేరువ చేయడంలో కీలక పాత్ర పోషించారు.కొత్తగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పవిత్ర కూడా అదే ఉత్సాహంతో వైద్య సేవలను ప్రజలకు అందిస్తూ,ఆరోగ్య రంగాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సంకల్పం వ్యక్తం చేశారు.జిల్లాలో ఈ పరిపాలన మార్పులు వైద్య సేవలలో మరింత చురుకుదనాన్ని తీసుకువస్తాయని అధికారులు భావిస్తున్నారు.







## మోమిన్‌పేట్‌లో పదో తరగతి ఫలితాలు

- 89.70% ఉత్తీర్ణత బాలికల ఆధిపత్యం :విద్యాధికారి నర్సింలు




**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్‌పేట్ మండలంలో పదో తరగతి ఫలితాలు ఉత్తేజకరంగా నమోదయ్యాయి. మొత్తం 333 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 299 మంది ఉత్తీర్ణత సాధించి 89.70 శాతం ఫలితాన్ని నమోదు చేసినట్లు మండల విద్యాధికారి నర్సింలు తెలిపారు.ఈ ఫలితాల్లో బాలికలు ఆధిపత్యం చాటారు.మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. మోమిన్‌పేట్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఎం.శ్రీవిద్య 539 మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. ముస్కాన్ బేగం (534), కోల్కుంద జడ్పీ హైస్కూల్‌కు చెందిన ముబీన (529), బి.నందిని (500), వెల్చల్ పాఠశాలకు చెందిన కీర్తన (523), విద్య (515), మోరంగపల్లి పాఠశాలకు చెందిన చరణ్య (506), మేకవనంపల్లి పాఠశాలకు చెందిన అశ్వక్ (506) ఉత్తమ ఫలితాలు సాధించారు. అలాగే చంద్రాయన్‌పల్లి కేజీబీవీ పాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత నమోదైందని ప్రిన్సిపాల్ ప్రభావతి తెలిపారు. మండలంలోని విద్యార్థులు సాధించిన ఈ విజయంపై విద్యాశాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

# మేడే ఫాదర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్...!

భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్ గారు అన్ని వర్గాలకు సమన్యాయం ప్రాధాన్యతతో సమాజానికి కార్మిక శక్తి ప్రాధాన్యత తెలుపుతూ కార్మిక చట్టాల ప్రాముఖ్యత వివరిస్తూ..

**మేడే దినోత్సవం సందర్భంగా**

మే మొదటి రోజును ప్రపంచ కార్మిక దినోత్సవంగా గుర్తించిన తర్వాత, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన చట్టాలను తీసుకురావాలని ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో చర్చలు జరిగాయి.భారతదేశంలో ఇటువంటి చట్టాలను తీసుకురావడంలో మరియు కార్మికుల ప్రయోజనాల ఆధారంగా ప్రస్తుత చట్టాలలో కొత్త సెక్షన్లను తీసుకురావడంలో డా. అంబేద్కర్.

**స్వతంత్ర వర్కర్స్ పార్టీ**

డాక్టర్ అంబేద్కర్ 1936లో అంబేద్కర్ రాజకీయ పార్టీ, స్వతంత్ర కార్మిక పార్టీని స్థాపించారు. పార్టీ తరపున, 15 మంది సభ్యులు బ్రిటిష్ పాలనలో ఎన్నికలలో పోటీ చేసి బొంబాయి అసెంబ్లీకి ఎన్నికయ్యారు.ఆయన ప్రారంభించిన రాజకీయ పార్టీ కూడా కార్మికుల ప్రయోజనాల కోసమే పెట్టడం గమనార్హం.

**కార్మిక సంక్షేమ శాఖ సభ్యుడు:**

1942 జులై 20న బ్రిటీష్ పాలకులు అప్పటి వైస్రాయ్ కౌన్సిల్‌లో అంబేద్కర్‌ను కార్మిక సంక్షేమ శాఖ సభ్యునిగా చేశారు.ఈ పదవి పార్లమెంటరీ మంత్రితో సమానం.

**కార్మిక చట్టాలలో అంబేద్కర్ పాత్ర**

కార్మిక చట్టాల ఏకరూపత ఆవశ్యకత, పేపర్ కంట్రోల్ ఆర్డర్, ఇండియన్ టీ కంట్రోల్ బిల్లు, స్కిల్డ్ మరియు సెమీ స్కిల్డ్ కార్మికులకు ఉపాధి కేంద్రాల ప్రకటన, కార్మికులకు డిమాండ్‌పై వేతనాలు, కార్మిక చట్టాలు, కార్మిక ప్రయోజనాల పథకం,సామాజిక భద్రత, వేతనం,ఆరోగ్యం,మోటారు వాహనాలు (డ్రైవింగ్).బిల్, మైనింగ్ మెటర్నిటీ వెల్ఫేర్ (సవరణ) బిల్లు, ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సవరణ) బిల్లు, ఫ్యాక్టరీల (సవరణ) బిల్లు, ఫ్యాక్టరీ కార్మికులకు వేతన సెలవులు,వేతన కేటాయింపు (సవరణ) బిల్లు,మైనింగ్ వర్కర్స్ 'మెటర్నిటీ అసిస్టెన్స్ (సవరణ) బిల్లు, పారిశ్రామిక కార్మికుల సంక్షేమ బీమా భారతీయ పారిశ్రామిక కార్మికులకు గృహనిర్మాణ పథకం, కార్మికుల 'పరిహారం (సవరణ) బిల్లు మరియు సహా పలు చట్టాలపై సెంట్రల్ అసెంబ్లీ (ప్రస్తుత పార్లమెంట్) లో చర్చలు తీసుకొచ్చాడు. కార్మికుల పునరావాస పథకం. కార్మికులతో సన్నిహితంగా మెలిగేందుకు మరియు వీలైనంత త్వరగా వారి ఫిర్యాదులను వినడానికి కర్మాగారాల్లో కార్మికుల సంక్షేమ అధికారులను నియమించడం అభిలషణీయమని కేంద్ర కేబినెట్‌కు ఆయన నాయకత్వం వహించారు.

**కార్మికులు మరియు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం**

సామాజిక ప్రజాస్వామ్యం మరియు ఆర్థిక ప్రజాస్వామ్యం రాజకీయ ప్రజాస్వామ్యానికి నాడి మరియు సిర; ఈ నరం, సిర బలంగా ఉంటేనే శరీరం దృఢంగా,ఆరోగ్యంగా ఉంటుంది. సమానత్వానికి మరో పేరు ప్రజాస్వామ్యం.



పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్వాతంత్ర్య దాహాన్ని, కోరికను రేకెత్తించిందనడంలో సందేహం లేదు. కానీ అది ఎప్పుడూ సమానత్వానికి అనుకూలంగా తల వంచలేదు.సమానత్వం యొక్క ప్రాముఖ్యతను గుర్తించడంలో విఫలమైంది.అంతే కాదు, స్వేచ్ఛ మరియు సమానత్వం మధ్య సమతౌల్యాన్ని సృష్టించే ప్రయత్నం కూడా చేయలేదు. ఫలితంగా స్వాతంత్ర్యం సమానత్వాన్ని మింగేసింది. అంతే కాదు మరెన్నో అసమానతలు కనిపించడానికి మార్గం సుగమం చేసింది.

**స్వేచ్ఛ,సమానత్వం,సోదరభావం**

స్వేచ్ఛపై కార్మిక దృక్పథం ప్రజలు ఓటు హక్కును గుర్తించడంతో ముగియదు. కార్మికుల దృక్కోణం నుండి స్వేచ్ఛ అనేది సృజనాత్మకమైనది. ప్రజలతో కూడిన ప్రభుత్వం అనే ఆలోచన కూడా ఇందులో ఉంది.కార్మికుల అభిప్రాయం ప్రకారం ప్రజల ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కాదు.ఇది ప్రభుత్వ రూపం.దానికి ప్రజల సహకారం ఓట్లు వేసి పాలించడాన్ని వారి యజమానులకే వదిలేసే సంస్థ. ఇటువంటి ప్రభుత్వ వ్యవస్థ కార్మికవర్గం దృష్టిలో ప్రజా ప్రభుత్వాన్ని అపహాస్యం చేయడమే. ప్రజారక్షక ప్రభుత్వం ప్రజల కోసమే కాకుండా వాస్తవికంగా ఉండాలి.కార్మిక సమానత్వం అంటే చట్టంలో, ప్రభుత్వ సేవలో,సైన్యంలో పన్నుల విషయంలో, వాణిజ్యం మరియు పరిశ్రమలలో అన్ని వ్యక్తిగత హక్కులను రద్దు చేయడం. నిజానికి అసమానతకు దారితీసే అన్ని మార్గాలను తొలగించాలి. కార్మికులకు సోదరభావం కావాలి. ప్రపంచ శాంతి మరియు మానవ సౌహార్ద ప్రాతిపదికన అన్ని తరగతులను మరియు అన్ని దేశాలను ఏకం చేయడం దీని ఆశయం.

**కార్మికులు మరియు జాతీయులు**

కార్మికులను ఎక్కువగా వ్యతిరేకించే వారు జాతీయవాదులు. కార్మికులు పరస్పర విరుద్ధమైన మరియు భారత వ్యతిరేక దృక్పథాన్ని కలిగి ఉన్నారని వారు ఆరోపించారు.జాతీయవాదం ప్రాచీనతను బోధిస్తే మరియు రూపం లేని ప్రతిదానిని తిరస్కరించినట్లయితే, జాతీయవాదాన్ని కార్మికులు దాని సూత్రంగా అంగీకరించలేరు.ఒకప్పటి భావజాలాన్ని ప్రస్తుత భావజాలంగా కార్మికులు అంగీకరించరు. నానాటికీ విస్తరిస్తున్న మానవ స్పృహ స్వరపేటికను గతం చేయి నలిపివేయడాన్ని అంగీకరించదు. ప్రజల జీవితాలను పునర్నిర్మించడానికి మరియు రూపొందించడానికి జాతీయవాదం అడ్డుగా ఉంటే, కార్మికులు జాతీయవాదాన్ని తిరస్కరించాలి. కార్మికులకు, జాతీయవాదం ముగింపుకు సాధనం. వారు లేకుండా కార్మికులు జీవితానికి అవసరమైన సూత్రాలుగా భావించే వాటిని త్యాగం చేయడానికి అంగీకరించే అంతిమ లక్ష్యం కాదు.

**సామాజిక భద్రత మరియు కార్మిక రక్షణలో రెండు వైరుధ్యాలు**

పెట్టుబడిదారీ పారిశ్రామిక వ్యవస్థలో మరియు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అని పిలువబడే రాజకీయ వ్యవస్థలో నివసిస్తున్నవారు తమ సంస్థలకు రెండు వైరుధ్యాలు ఉన్నాయని అంగీకరించాలి. మొదటి వైరుధ్యం పర్వతాలతో కూడిన సంపద మరియు కడు పేదరికం మధ్య అగాధం.ఇంకా ఈ వైరుధ్యం సామాన్యమైనది కాదు; పరాకాష్టకు చేరిన వైరుధ్యం.ఈ రోజు మనం వ్యతిరేక ఫలితంగా ఏమి చూస్తున్నాము? ఉల్లాసపురిలో చుక్క చెమట కూడా లేకుండా జీవించే వారు కోటీశ్వరులు కాగా, నేలను తడిపేందుకు నుదురు తుడుచుకునే వారు కడు పేదరికంలో మగ్గడం చూస్తున్నాం.రెండవ వైరుధ్యం రాజకీయ మరియు ఆర్థిక వ్యవస్థల మధ్య పొందుపరచబడింది. అంటే రాజకీయాల్లో సమానత్వం; ఆర్థిక వ్యవస్థలో అసమానత.ఒకరికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక విలువ ఇదీ మన రాజకీయ సిద్ధాంతం. కానీ ఆర్థిక శాస్త్రంలో మన సిద్ధాంతం మన రాజకీయ సిద్ధాంతానికి ఖండన. ఉదాసీనంగా ఉండటమే.ఈ వైరుధ్యాలను ఎలా తొలగించాలనే దానిపై భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. అయితే ఈ ఘోరమైన వైరుధ్యాలు ఎక్కడి నుంచి వస్తున్నాయనే విషయంలో భిన్నాభిప్రాయాలకు తావు లేదు.ఈ వైరుధ్యాలు కళ్లకు కట్టినట్లుగానూ, తీవ్రంగానూ ఉన్నా, గతంలో అత్యధికులు ఈ దారుణాన్ని, విషాదాన్ని పట్టించుకోలేదు. కానీ నేడు పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.

**సామాజిక అర్హత**

మనిషి యొక్క హక్కులు మరియు అతని వివిధ స్వేచ్ఛలను నిర్ణయించడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి.వీటిని తన జన్మహక్కుగా భావించాలని కూడా ఉద్ఘాటించారు.ఈ హక్కులన్నీ సామాన్యులు ప్రశాంత జీవితాన్ని గడపడానికి, ఇంట్లో నివసించడానికి, దుస్తులు ధరించడానికి, చదువులో సుఖంగా ఉండటానికి మరియు ఆరోగ్యంగా ఉండటానికి వీలు కల్పించాలి.అన్నింటికంటే మించి, ప్రపంచంలోని హైవేలపై దిగజారిపోతామనే భయం లేకుండా, తల ఎత్తి గంభీరంగా నడిచే హక్కు అతనికి ఉండాలి.ఇవన్నీ లేకుండా, సామాజిక అర్హత అనేది పూర్తిగా అర్థరహితం మరియు కేవలం కాగితం ముక్క మాత్రమే.

**కెరీర్ అభివృద్ధి**

భారతదేశంలో పరిశ్రమను అభివృద్ధి చేయడమే మా లక్ష్యం సరిపోదు. అటువంటి కెరీర్ అభివృద్ధిని సామాజికంగా కోరుకునే స్థాయిలో చూడాలి.భారతదేశంలో ఇంకా ఎక్కువ సంపదను ఉత్పత్తి చేయడం మరియు పోగుచేయడంపై మన శక్తులు మరియు ప్రయత్నాలను కేంద్రీకరించడం సరిపోదు. ఈ సంపదలో భాగస్వామ్యం పొందే హక్కు భారతీయులందరికీ ఉందని మనం అంగీకరించాలి.అప్పుడే వారు సుభిక్షంగా జీవించడం సాధ్యమవుతుంది. వారు అసురక్షితంగా మారకుండా నిరోధించే మార్గాలను కూడా మనం కనుగొనాలి.

అలా కార్మికుల సంక్షేమం పట్ల శ్రద్ధ వహించి వారి జీవితాలను మెరుగుపరిచి గొంతులేని ప్రజల గొంతుకగా నిలిచిన వైద్యుడు. దీని ద్వారా అంబేద్కర్ పాత్ర ఎనలేనిదని మనకు తెలుస్తుంది.

**కార్మిక లోకానికి, శ్రమజీవులకు కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు**

వార్త సేకరణ మే డే సందర్భంగా వివిధ వార్త పత్రికలు, కార్మిక చట్టాల సంక్షిప్త సమాచారం



సేకరణ
- బోయ వెంకటేశం
అభినవవాల్మీకి
గోటిగార్ పల్లి
సంగారెడ్డి జిల్లా
9491565518

# పదవ తరగతి ఫలితాల జోరు..88%శాతం ఉత్తీర్ణత

- పదవ తరగతి ఫలితాల్లో పెద్దేముల్ మండల ఆయా పాఠశాలల విద్యార్థుల హవా
- పదవ తరగతి ఫలితాల్లో పెద్దేముల్ మండలంలో 88% శాతం ఉత్తీర్ణత
- మొత్తం 566 మందిలో 498 మంది ఉత్తీర్ణత సాధన
- మూడుపాఠశాలల్లో 100% శాతం ఫలితాలు
- ఉన్నత పాఠశాలల విద్యార్థుల అద్భుత ప్రదర్శన
- ఇంగ్లీష్ మీడియంలో అత్యధిక ఉత్తీర్ణత
- పెద్దేముల్ మండల ఎంఈఓ నర్సింగ్ రావు
- మండల స్థాయిలో కడప ఫణీంద్రకు(569l ఫస్ట్ ర్యాంక్, ఎం.నిహారిక (566) సెకండ్ ర్యాంక్, ముడావత్ రాధిక (547) థర్డ్ ర్యాంక్
- ఉపాధ్యాయుల కృషి,విద్యార్థుల శ్రమకు తగిన ఫలితం
- పలు పాఠశాలల్లో 90% పైగా ఉత్తీర్ణత నమోదు
- మహాత్మ జ్యోతిబా ఫూలే పాఠశాలలో 99% ఫలితం
- గ్రామీణ విద్యార్థుల ప్రతిభకు మరో నిదర్శనం
- పెద్దేముల్ విద్యా రంగంలో మెరుగైన పురోగతి సంకేతాలు

**SSC 2026 RESULTS PEDDEMUL MANDAL**

| S No | Mandal | SchoolCode | School Name | Appeared TM | Appeared EM | Appeared UM | Appeared TOTAL | PASSED TM | PASSED EM | PASSED UM | PASSED TOTAL | Pass % | Highest Marks | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | PEDDEMUL | 36241301110 | KGBV PEDDEMUL | 0 | 39 | 0 | 39 | 0 | 39 | 0 | 39 | 100 | 541NIHARIKA | |
| 2 | PEDDEMUL | 36241301007 | ZPHS INDUR (UM) | 0 | 0 | 10 | 10 | 0 | 0 | 10 | 10 | 100 | 437 AMEERA BEGUM & 437 MOHAMMAD AMJATH KHAN | |
| 3 | PEDDEMUL | 36241300204 | ZPHS ADIKCHERLA | 25 | 0 | 0 | 25 | 20 | 0 | 0 | 20 | 80 | 507 BUSHRA KATHUN | |
| 4 | PEDDEMUL | 36241301404 | ZPHS MAREPALLY | 11 | 0 | 0 | 11 | 11 | 0 | 0 | 11 | 100 | 566 N NIHARIKA | 2nd |
| 5 | PEDDEMUL | 36241300508 | ZPHS THATTEPALLY | 28 | 0 | 0 | 28 | 26 | 0 | 0 | 26 | 93 | 515 NAVANEETHA | |
| 6 | PEDDEMUL | 36241301108 | ZPHS (G) PEDDEMUL | 23 | 0 | 0 | 23 | 21 | 0 | 0 | 21 | 91 | 459 REGONDI MEENAKSHI | |
| 7 | PEDDEMUL | 36241301006 | ZPHS INDUR | 11 | 28 | 0 | 39 | 7 | 26 | 0 | 33 | 85 | 519 T MADHUKIRAN | |
| 8 | PEDDEMUL | 36241302405 | ZPHS KANDANELLY | 29 | 43 | 0 | 72 | 20 | 40 | 0 | 60 | 83 | 507 TATIKONDA ARCHAN | |
| 9 | PEDDEMUL | 36241302606 | ZPHS MAMBAPUR | 28 | 57 | 0 | 85 | 21 | 53 | 0 | 74 | 87 | 547 MUDAVATH RADHIKA | 3rd |
| 10 | PEDDEMUL | 36241301109 | ZPHS (B) PEDDEMUL | 45 | 66 | 0 | 111 | 30 | 62 | 0 | 92 | 83 | 543 HARINI | |
| 11 | PEDDEMUL | 36241301120 | TGMS PEDDEMUL | 0 | 54 | 0 | 54 | 0 | 44 | 0 | 44 | 81 | 502 VISHNU SANDHESH | |
| 12 | PEDDEMUL | | MJP MAMBAPUR | 0 | 69 | 0 | 69 | 0 | 68 | 0 | 68 | 99 | 569 KADAPA FANIDRA | 1st |
| TOTAL | | | | 200 | 356 | 10 | 566 | 156 | 332 | 10 | 498 | 88 | | |



**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:**

పెద్దేముల్ మండలంలో ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 88% శాతం ఉత్తీర్ణత నమోదై మంచి ఫలితాలు సాధించబడ్డాయి. ముఖ్యంగా పెద్దేముల్ పరిధిలోని ఉన్న మొత్తం 12 ఉన్నత పాఠశాలల నుంచి ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలకు మొత్తం 566 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 498 మంది ఉత్తీర్ణత సాధించారు. మాధ్యమాల వారీగా పరిశీలిస్తే, పెద్దేముల్ మండలంలో ఆయా పాఠశాలల నుండి తెలుగు మీడియంలో 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 156 మంది ఉత్తీర్ణత సాధించగా, ఇంగ్లీష్ మీడియంలో 356 మంది హాజరై 332 మంది ఉత్తీర్ణత పొందారు.అదే విధంగా ఉర్దూ మీడియంలో 10 మంది హాజరై అందరూ పాస్ అవ్వడం విశేషం .ఈ ఫలితాల్లో భాగంగా కొన్ని పాఠశాలల్లో 100 కు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.అందులో ముఖ్యంగా మారేపల్లి కేజీబీవీ పాఠశాలలో 39 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 39 విద్యార్థులంతా పాస్ అయ్యారు. ఇందూరు ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 మంది విద్యార్థులకు 10 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించారు.అలాగే మారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 మంది విద్యార్థులకు 11 మంది పాస్ అవ్వడం గమనార్హం. మిగతా పాఠశాలల్లో కూడా మంచి ఫలితాలు నమోదయ్యాయి. పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్



గ్రామ సమీపంలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలలో 99% శాతం, తట్టేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 93% శాతం, పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 91% శాతం ఉత్తీర్ణత నమోదైంది.

**పెద్దేముల్ మండల టాపర్లు వీరే**

మండల స్థాయిలో టాపర్ల వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దేముల్ మండల పరిధిలోని మంబాపూర్ మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలకు చెందిన కడప



ఫణీంద్ర 600 మార్కులకు గాను 569 మార్కులు సాధించి పెద్దేముల్ మండల స్థాయిలో మొదటి స్థానాన్ని పొంది మండల ఫస్ట్ ర్యాంక్ దక్కించుకున్నారు.అదే విధంగా మారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.నిహారిక 600 మార్కులకు 566 మార్కులను సాధించి మండల స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది.అదే విధంగా మంబాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మూడవత్ రాధిక 600 మార్కులకు 547 మార్కులను మండల స్థాయిలో మూడవ ర్యాంక్ సాధించింది.ఈ సందర్భంగా పెద్దేముల్ మండల విద్యాధికారి నర్సింగ్ రావు మాట్లాడుతూ..పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు పరిధిలోని 12 పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు సమిష్టిగా కృషి చేయడంతో పదవ తరగతి ఫలితాల్లో మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల కృషిని ప్రశంసిస్తూ,ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.





# పది ఫలితాలలో సత్తా చాటిన హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు

- ఫలితాలలో 100% ఉత్తీర్ణతతో సంచలనం
- 595 మార్కులతో విద్యార్థిని అగ్రస్థానం
- శిక్షణలో నాణ్యత – ఫలితాల్లో ప్రతిభ
- స్కూల్ విధానానికి విద్యార్థుల విజయం ముద్ర

**అనంతపురం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** పదో తరగతి ఫలితాల్లో హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రికార్డు స్థాయి ఫలితాలను సాధించారు. మొత్తం 220 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై, 220 మంది ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలను నమోదు చేయడం విశేషం.

మటం కృతిక 595/600 మార్కులతో అగ్రస్థానం సాధించగా, బి.తనుశ్రీ, జి.మోక్షితా రెడ్డి,బి.జ్ఞాన మహిత తలా 593 మార్కులు సాధించారు. సి. హేమంత్ సాయి రెడ్డి 592 మార్కులు, జి.అరుణ్ కుమార్ రెడ్డి,ఐ.పూర్వికా రెడ్డి,తలా 591 మార్కులతో మెరిశారు. యూ.భావేష్,సుస్మిత 590 మార్కులు సాధించారు.ఈ ఫలితాల్లో 85 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు సాధించగా, 185 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం ద్వారా పాఠశాల స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా సీఈఓ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. నేడు ప్రకటించినటువంటి 10వ తరగతి ఫలితాల్లో మా పాఠశాల విద్యార్థులు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతంపై చేయి సాధించడమే కాకుండా అద్భుతమైన ఫలితాలను సాధించడం మా స్కూల్ విద్యార్థులు విద్యా విధానానికి ఒక గొప్ప పథకాన్ని వారు గుర్తు చేశారు.విద్యార్థులు ప్రతి ఒక్కరూ లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రులు ఆశయాలు అనుగుణంగా కృషి చేస్తూ తరగతి గదులు బోధించినటువంటి విషయాలు ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ అద్భుతమైనటువంటి ఫలితాలు వైపు పయనించాలని వారు సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జీఎం రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో విద్య అంటే మార్కులు మాత్రమే కాదు.భవిష్యత్తును నిర్మించే శక్తి అని , మా పాఠశాలలో ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉందని మేము నమ్ముతున్నామని,ఆ ప్రతిభాను వెలికి తీసి విజయంగా మలచడం మా లక్ష్యం నాణ్యమైన విద్యతోపాటు నైతిక విలువలు నాయకత్వ లక్షణాలు ఆత్మవిశ్వాసం జీవిత నైపుణ్యాలను పెంపొందిస్తున్నామన్నారు. మేము విద్యార్థులను కేవలం పరీక్షల కోసమే కాదు, భవిష్యత్తు జీవితాన్ని కూడా సిద్ధం చేస్తున్నామన్నారు.ఈ విజయంతో మా సంస్థకు గౌరవం గుర్తింపు మరింత పెరిగింది అని ఈ సందర్భంగా మా మీద విశ్వాసం ఉంచిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏజీఎం శంకర్ నారాయణ మాట్లాడుతూ..పదవ తరగతి పరీక్షల్లో మా పాఠశాల విద్యార్థులు సాధించిన మార్పులే మా పాఠశాల నైపుణ్యాలకు నిదర్శనం అన్నారు.బాగా చదివే విద్యార్థులను అత్యుత్తమంగా సగట విద్యార్థిని ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దటంలో మా టీచర్లకు కృషి అభినందన ఏమన్నారు చదువుతోపాటు జీవితంలో అన్ని ఒడిదలుకులను తట్టుకునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దటం హైదరాబాద్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సొంతమని అన్నారు.